అనుకున్నాను. పైగా నాది ముష్టి సొమ్మా? మా తాతతు ముష్టెత్తి గడించేరను కున్నావా? నా తండ్రీ! ఇంతకీ నీ తప్పేం వుందిలే. క్రిమినల్ కేసంటే కుక్కకి కూడా లోకువే. అని మనసులో అను కున్నా, అల్లుడి సలహా పాటించక తప్పలేదు నారాయణకి.

❖ ❖ ❖

మర్నాడు నారాయణ మీది కేసు కొట్టేసేరు మేస్ట్రీటు గారు. ఆ సాయంత్రమే ఛార్జీ కూడా ఇచ్చేసారు, కొత్త మేస్ట్రీటు గారికి.

ఇంక నాలుగు రోజుల్లో మేస్ట్రీటు గారు ఆ వూర్నించి వెళ్ళి పోతారు. ఈ రోజు రాత్రి క్లబ్బులో వారికి కుటుంబ సమేతంగా డిన్నరు ఏర్పాటు చేసేడు క్లబ్బు సెక్రటరీ, నారాయణ అల్లుడు, క్లబ్బుకీ, మేస్ట్రీటు గారింటికి అర ఫర్లాంగే దూరం వున్నప్పటికీ, వారిని దగ్గరుండి కారులో తీసుకొని వెళ్ళేడు. డిన్నరు పెళ్ళంత ఘనంగా జరిగింది.

జడ్జీలకి చెవులేగాని కళ్ళు వుండవన్న నింద మన మేస్ట్రీటు గార్ని చూశాక తొలగించక తప్పదు. వీరు ముద్దాయి మొహం చూడగానే అతను దోషో కాదో ఠక్కున చెప్ప గలిగేవారు. ఇలాంటి న్యాయమూర్తిని మనం ఇంకా కొంతకాలం పాటు వుంచుకోలేకపోవడం మన దురదృష్టం, వీరి గుణగణాల గురించీ, నీతినిజాయితీల గురించీ నాలాంటి వాడు మాట్లాడడం సాహసమే అవుతుంది. అంచేత తిరిగి వీరు ప్రమోషను మీద మన వూరు రావాలని కోరుకోవడం మన విద్యుక్తధర్మం. కనీసపు కోరిక. అంటూ తన ఆఫ్టర్ డిన్నర్ స్పీచ్ ముగించేడు సెక్రటరీ.

డిన్నరైన తర్వాత, సెకండుషో సినిమాకి తీసుకొని వెళ్ళి, మళ్ళీ వారిని కారులో ఇంటికి దిగబెట్టినప్పుడు, ఇంటి దగ్గర వారు ఫెయింటు అవకుండా పట్టుకుని కూర్చో పెట్టేడు. ఆయన ఫెయింటు అవడానికి కారణం ఆయన అనారోగ్యం గాని, లేక అంతకుముందే డిన్నర్లో సేవించిన మందు గాని కారణంకాదు.

వీరంతా యిల్లు చేరేసరికి యింటివీ, యినప బీరువావీ తలుపులు తీసి వున్నాయి. జవాను స్తంభానికి కట్టేసి వున్నాడు. ఇనప్పెట్టె ఖాళీగా వుంది.

తర్వాత కార్యక్రమం అంతా నారాయణ అల్లుడే చకచకా జరిపేశాడు. ఎస్.ఐ.ని. పిల్చుకొని రావడం, మేస్ట్రీటు గార్ని వూరడించడం, తెల్లవార్లూ ఎస్.ఐ.తో కలిసి దొంగల కోసం తిరగడం అన్నీ స్వయంగా చేసేడు. మర్నాడు ఉదయం పది గంటలకి యింటికి వెడుతూ మీరేం విచారించకండి సార్. దొంగ వెధవలు ఎక్కడికి పోతారు? మీలాంటి వారి ఉసురు వూరికే పోదు. నేనూ, ఎస్.ఐ. కలిసి వూళ్ళన్నీ గాలించి మీ సొమ్ము మీకప్పచెప్తాం. నిన్నటినుండి యింటి దగ్గర కనిపించ లేదు నేను. మా వాళ్ళేం భయపడుతున్నారో? ఒక్కసారి యింటికి వెళ్ళి తిరిగి తమ దర్శనం చేసుకుంటాను. అంటూ ఓదార్చి వెళ్ళిపోయేడు.

ఆ రాత్రి నారాయణ అల్లుడు నారాయణకి లంచం సొమ్ము పదివేలు యిచ్చేస్తూ, ఇదిగో మరో పదిహేను వేలు ఎక్కువ వున్నాయి. ఆ మేస్ట్రీటు గాడికే యిచ్చేస్తారో, కుక్కల ఆస్పత్రికే యిచ్చేస్తారో మీ యిష్టం అంటూ డబ్బు ఇచ్చేసాడు.

**(1971)**

# మున్నా లేక సమ్ వేర్ ఇన్ "బాంగ్లాదేశ్"

**మూ**డేళ్ళ మున్నాకి దేశంలో ఏమవుతోందో తెలియదు కాని ఏదో అవుతుందని మాత్రం తెలుసు. అసలు మున్నాకి యీ నెల రోజులనుండి ఊపిరి సలపడంలేదు. పల్లె అంతా ఏదో సంబరం చేసుకున్నట్లు ఎంతో హడావిడిగా సరదగావుంది. ఒక రోజు ఉన్నట్టుండి పాతజెండాలు తీసేసి ఇళ్ళమీద కొత్త జెండాలు పెట్టేరు. కొత్త జెండాలు పచ్చగా ముచ్చటగా ఎంతో నచ్చేయి మున్నాకి. తన యింటిమీదున్న జెండా తన స్వంతం అన్నట్టు ఫీలయ్యేడు. ఎంచేతంటే ఆ వేళ ఇంటింటికి జెండాలు పంచిపెడుతున్న కుర్రాళ్ళు – వాళ్ళ ఇంటికి కూడా వచ్చినప్పుడు మున్నా నాన్నకి సలాం పెట్టేరుగాని జెండా ఇవ్వలేదు. మున్నాకి జెండా యిచ్చి, ఇంటి ముందు ఖాళీస్థలంలో కొయ్యపాతి మున్నా చేత జెండా ఎగరవేయించారు. జెండా ఎగుర వేశేక అందరూ మున్నాని ముద్దుపెట్టుకున్నారు. మామూలువాళ్ళు ముద్దు పెట్టుకున్నప్పుడు మున్నాకి కితకితలు అనిపించి మొగ్గలా ముడు చుకుపోయేడు.

ఆ తర్వాత రోజూ పల్లెకు కాస్తదూరంగా వున్నవాళ్ళ ఇంటి ముందే ఆడామొగా అంతా పోగై డ్రిల్లు చేసేవారు.ఆ డ్రిల్లు ఎంతో నచ్చింది. వాళ్ళలో కొంతమందికి కాకీబట్టలు వుండేవి, ముగ్గురికే తుపాకులుండేవి. మిగిలినవాళ్ళకి పంచెలు, పైజ

మాలు, ఈటెలూ, కర్రలూ వుండేవి. అందరి కంటే కాకిబట్టల వాళ్ళంటేనే మున్నాకి చాలా గౌరవం. తుపాకులున్న వాళ్ళంటే భక్తి. తను కూడా పెద్దె య్యేక కాకీబట్టలు వేసుకొని జీపుఎక్కి ఎప్పుడు వెళతాడో? మొదట్లో జీవులు వాళ్ళ ఇంటికి వచ్చేవి కావు. అప్పుడు ఎవరో ఎక్కడినుంచో సైకిళ్ళమీద వచ్చి, ఏవో కాయితాలు యిచ్చి, టీ త్రాగి, ఏదో మాటాడి, కాళ్ళూ చేతులూ ఊపుకుంటూ వెళ్ళిపోయేవారు. ఎందుకోగాని కొందరు విపరీతంగా ఉమ్మేవారు. వాళ్ళు ఉమ్ముతున్నప్పుడు వాళ్ళ కళ్ళు – అమ్మను అల్లప్పుడెప్పుడో కొట్టిన నాన్న కళ్ళలా – ఎర్రగా అయిపోయేవి. వాళ్ళకళ్ళుచూస్తే మున్నాకి భయం వేసేది కాని వాళ్ళు మున్నాని ఎంతో ముద్దుచేసి చాక్‌లెట్లు, చక్కెరబిళ్ళలూ ఇచ్చేవారు.

డ్రిల్లు అవగానే తుపాకీ పేల్చేవారు. ఆ తుపాకీ గుండుకి ఒకసారి ఒక గెద్ద చనిపోతే అంతా విరగబడినవ్వేరు. వాళ్ళు యెందుకు అంత నవ్వేరో మున్నాకి అర్థంకాలేదు, అంతగా నచ్చలేదు కూడాను. తుపాకీ పేల్చాక జెండాక్రింద నిలబడి ఎవడో ఒకడు ఏదో మాట్లాడేవాడు అందులో ఒక్క అక్షరం కూడా తనకి అర్థం కాకపోయినా శ్రద్ధగా వినేవాడు మున్నా.

అన్నిటికంటె మున్నాకి బాగా నచ్చిన సంగతి – ఒకనాడు తెల్లవారుజామున ఊళ్ళోవున్న మనుషులంతా వచ్చి వాళ్ళపెరట్లో పెద్ద గొయ్యితీసి, ఊళ్ళోవున్న ధాన్యం అంతా అందులోపోసి కప్పెయ్యడం. ఇంకొకరోజు అంతకంటె ఇంకా నచ్చినది జరిగింది – ఆవేళ వాళ్ళ పెరట్లో వేపచెట్టు క్రింద యింకొక చిన్న గొయ్యితీసి ఊళ్లోకి ఆడవాళ్ళందరూ తమ నగలూ అవీ అందులో పడెయ్యడం. అప్పుడా ఆడవాళ్ళందరూ కోపమొచ్చిన అమ్మలా ఎర్రగా అయిపోయేరు. మున్నాకి పిచ్చి భయంవేసింది. వెంటనే తన చిటికినవేలికున్న చిన్న వుంగరం కూడా తీసి అందులో పడేశాడు. అప్పుడు అక్కడవున్న ఆడవాళ్ళందరూ పకపక విరగబడి నవ్వి మున్నాని గుండెలకు వేసుకొని నొక్కేశారు. ఆ తర్వాత గొయ్యి కప్పేసి దానిమీద చెత్త, చెదారం కప్పి వెళ్ళిపోయేరు. వాళ్ళు వెళ్ళిపోయేక మున్నాకూడా వాళ్ళలాగే ఒక్క క్షణం ఆకాశంలోకి చూసి గోతిమీద నాలుగు ఎండుటాకులు పడేసేడు.

ఒకనాడు ఇంటిముందు పెద్దవాళ్ళు డ్రిల్లు చేస్తుంటే మున్నా తనకి కూడా తుపాకీ కావాలని ఏడిచేడు. ఇవ్వకపోయినా ముందు ముద్దుముద్దుగా ఊరుకున్న తర్వాత వాళ్ళు మున్నాని కోప్పడ్డారు. అంచేతే మున్నాకి యీ పెద్దవాళ్ళు చేసేవి ఏవీ అర్థంకావు.

"ఛీ! ఛీ! అందుకే యీ పెద్దవాళ్ళంటే నాకు అసహ్యం" అనుకున్నాడు మున్నా.

అనుకొని వెంటనే తనే ఒక కర్రకి తాడుకట్టి, డ్రిల్లులో వాళ్లు తుపాకి పట్టుకున్నట్టే పట్టుకొని ఇల్లంతా టకటకా నడిచేడు. ఆ కర్ర అతనికి అచ్చు తుపాకీలాగే కన్పించేది. బహుశా వాళ్ళమ్మకి కూడా అలాగే కన్పించేది ఏమో! ఈ మధ్య అమ్మకి తనని ఎత్తుకోవడానికి బొత్తిగా తీరిక ఉండడంలేదు. ఈ హడావిడి రాకపూర్వం అమ్మ ఎప్పుడూ ఎత్తుకునేతిరిగేది. వంట నౌకర్లే వండేవారు. కాని ఇప్పుడు ఎందుకోగాని నౌకర్లంతా ఒకడూ, ఒకడూ ఎక్కడికో వెళ్ళిపోయేరు. వంటంతా పాపం అమ్మే చేస్తోంది. మొదట్లో అమ్మ ఇంట్లోవాళ్ళకే వండేది. పై ఊళ్ళనుండి వచ్చిన వాళ్ళకు టీ మాత్రం ఇచ్చేది. కాని ఈ మధ్య వచ్చిన వాళ్ళు భోజనం కూడా తమ ఇంట్లోనే చేస్తున్నారు.

రోజులు అన్నీ సరదాగా, హడావిడిగా, హాయిగా గడిచి పోతున్నా, నాన్న ఏమీ అనకపోయినా అమ్మ ఏడుపు ప్రారంభించింది. కాని విచిత్రం! ఇదివరకైతే గదిలో పడుకుని ఏడిచేదా? ఆవేళ మాత్రం ఏడుస్తూనే కళ్ళయినా తుడుచుకోకుండా ఇంటి పనంతా చేస్తూనే ఉంది. ఆవేళ సాయంత్రం. డ్రిల్లు అయేక మున్నా అన్నలు ఇద్దరూ అమ్మకీ, నాన్నకీ సలాం చేశారు. నాన్న వాళ్ళ భుజాలు తట్టి తన తెల్ల మీసం తిప్పేడు. కాని అమ్మ వాళ్ళని పట్టుకొని కళ్ళు కరిగిపోయేలా ఏడిచింది. అమ్మ అంతే. మున్నాకి భయంవేసి గదిలో మంచంకింద దూరిపోయాడు. కాని అతని అన్నలు వెదికి పట్టుకుని బైటకు తీసుకొచ్చి ముద్దు పెట్టుకొని వెళ్లిపోయేరు. మరి తర్వాత అన్నలు కనిపించలేదు. ఆవేళతో ఊరు దిక్కుమాలిపోయినట్లు అయి పోయింది. డ్రిల్లూలేదు, గిల్లూలేదు ఊళ్లో వున్న కొద్దిమందీ అకాశంవేపు చూస్తూ కూర్చోడం, విమానం కనిపించగానే ఊరి ప్రక్కనున్న అడవిలో దాగోడం. ఇదేం నచ్చలేదు మున్నాకి. అమ్మ వ్యవహారం అసలు నచ్చలేదు ఆ వీరుడికి. ఆవిడ పని పూర్తిగా మానేసి తలుపులన్నీ వేసుకొని ఒక గదిలో ఏడుస్తూ పడుకుంటుంది. పైగా తనని కూడా ఆ గదిలోనే పడుకోమంటుంది. పాపం అక్కలే వంటంతా చేస్తున్నారు. వంట చేస్తూ

చిన్నక్క చెయ్యి కాల్చుకుంది కూడాను. ఆవేళ నాన్నా, మిగిలిన ఒక్క నౌకరుకూడా ఈటెలు పట్టుకొని ఎక్కడికో వెళ్ళిపోయేరు మరి రాలేదు. ఈ వేళనుండి అక్కలు వంటచేస్తున్నా ఈటెలు పట్టుకునే వున్నారు. ఏవింటో గమ్మత్తుగా వుంది అంతవరకూ వాళ్ళు ఎప్పుడూ ఈటెలు పట్టుకోలేదు. ఛీ! ఛీ!! చిన్నక్కకి ఈటె సరిగ్గా పట్టుకోవడం కూడా రాదు.

ఆవేళ.... మున్నా ఇంటికి దూరంగా వెదురుగుబురు దగ్గర ఆడుకుంటున్నాడు. అతనికి కొంచెం దూరంలో గొర్రెలు గడ్డిమేస్తున్నాయి. గొర్రెల్ని చూస్తే తనకేం భయం? తన తుపాకి తన దగ్గరేవుందిగా? తనని, తన తుపాకిని చూసి పారిపోయిందో పిరికిపాము. తన అన్నల గురించి ఎంతసేపు ఆలోచించేడో మున్నాకే తెలీదు కాని, ఊళ్ళో జనం అంతా ఏడుస్తూ అడవిలోకి పారిపోవడం చూసి ఈ ప్రపంచంలో పడ్డాడు అతను. అతనికి పెద్దవాళ్ళు ఎందుకు ఏడుస్తారో అర్థంకాదు. ఆ పారిపోయే వాళ్ళలో తన చిన్నక్క కూడా వుంది. కాని వాళ్ళంతా చాలా దూరంగా వుండటం వల్ల తనని చూడలేదు.

అతను కూడా అడవిలోకి పరుగెత్తి వెళ్ళి వాళ్ళ కోసం ఎంత వెతికేడో? ఎంత తిరిగినా నక్కలూ, చెట్లూ తప్ప మనుషులు కనిపించలేదు. అబ్బ! కాళ్ళు ఎంతనొప్పిగా వున్నాయి. పెద్దవాళ్ళకైతే కాళ్ళు నొప్పిపెట్టవు! ఆవేళ తుపాకీ దెబ్బకి పడిన గెద్దలాంటి గెద్దలు మాత్రం ఆకాశంలో ఎగురుతున్నాయి. వెతకగా వెతకగా ఏవో వింతజంతువులు అతనికి కనిపించేయి. అవి మేకలు కావు, కుక్కలు కావు, ఆవులు అసలేకావు. వాటివేపుకి నడిచి వెళ్ళేడు మున్నా. తీరా వెళ్ళితే అవి జంతువులు కావు అన్నలు వాళ్లు డ్రిల్లు చేసినప్పుడు వేసుకునేవారే అలాంటి బట్టలు తొడుక్కున్న మనుషులు. వాళ్ళలో కొందరికి ముక్కుకింద గెడ్డాలు లేవు. కొందరికి మొహాలుసగమే వున్నాయి. గుండెలమీద షర్టులు ఎర్రగా వున్నాయి. డాళ్ళు, చేతులమీద ప్రాకుతూ ఎగరలేని రాబందుల్లా ఉన్నారు. కాళ్లూ చేతులమీద పాకే కాకీ గుడ్డల వాళ్ళంటే మున్నాకి ఎంతోసరదా. తన ఇంటి ముందు డ్రిల్లు చేసేవాళ్లు తనని వీపుమీత "గుర్రం" ఎక్కిం చుకొని ఆడేవారు. అంచేత వాళ్ళలో ఒకడివీపు ఎక్కి పోబోయే గొర్రెపోతు లా చూసి తన వాళ్ళతో కలసి ఏటి వేపు వెళ్ళిపోయేడు.

వాళ్ళంతా ఏట్లో తలలు ముంచి స్నానం చేస్తూ నీళ్ళు తాగుతున్నారు. తనని కూడా రమ్మని పిలిచారు. వీళ్ళంటే అసహ్యం వచ్చి మున్నా అక్కడనుండివెళ్ళిపోయి తన వాళ్ళకోసం వెతికేడు. ఎంత నడిచేడో! అబ్బ కాళ్ళు పీకెడుతున్నాయి. కరకర ఆకలి వేస్తోంది. ఏం చెయ్యడమో తోచక ఒక రాత్రి బండమీద కూర్చున్నాడు. అతనికి తెలియకుండానే నిద్ర పట్టేసింది.

ఆకులు చీల్చుకుని సూర్యుడు అతనిమీద బండమీద పచ్చగా పడ్డాడు. తెలివి వచ్చేసరికి మున్నాకి ఏమీ కనిపిం చడం లేదు. గుడ్డితనం అంటే ఏమిటో తెలియదు కాబట్టి సరిపోయింది లేకపోతే గుడ్డివాడు అయిపోయేనేమోనని భయపడేవాడు. కళ్ళు ఎంత పెద్దవిచేసి చూసినా అతనికి ఏమీ కనిపించడం లేదు. ఏవో పిట్టలో జంతువులో భయంకరంగా అరుస్తున్నాయి. పక్కనున్న "తుపాకీ" చేతిలోకి తీసుకున్నా మున్నాకి ఎంచేతో ధైర్యం రాలేదు. తుపాకి పట్టుకుని తనకు తోచినవేపు నడవడం ప్రారంభించేడు. ఎంతో నడిచేక సూర్యుడొస్తున్నట్టు ఆకాశం ఎర్రబడి ఆకాశం చూసేక ధైర్యం వచ్చి యింకా జోరుగా నడిచేడు మున్నా, అడవి దాటి బయటికి వచ్చేడు కాని అతనకి పరిసరాలు అన్నీ కొత్తగా వున్నాయి. తనకి తెలిసిన మనుషులు లేరు. ఇళ్ళు లేవు ఉన్న ఇళ్ళేవో కాలిపోతున్నాయి. కాలుతున్న ఇళ్ళకి దూరంగా వెళ్ళేడు అతను, అక్కడ కూడా మరో యిల్లు కాలుతోంది. ఆ వేడికి తట్టుకోలేక ఆ ఇంటిచుట్టూ తిరగడం ప్రారంభించేడు. తిరుగుతూ తిరుగుతూ ఉంటే ఆ యింటి పరిసరాలు ఎప్పుడో చూసినట్టే అనిపిస్తున్నది అలానడుస్తున్న అతను యెదో తన్నుకొని పడిపోయేడు. అతని చేతిలోని తుపాకీ తూలిపోయింది. పడిన దెబ్బకి కళ్ళు నీళ్ళు తిరిగేయి. లేచి కళ్ళు ఒత్తుకుంటూ చూశేడు. తను తన్నుకున్నది తన తల్లిని. ఆమె ఒంటిమీద బట్టలు లేవు. గుండెలో బాకు గుచ్చుకొని వుంది.

"మా" అని పిలవబోయేడు.

అతని నోటినుండి వచ్చిన శబ్దం పక్షి ఆర్తనాదంలా లేదు. పశువు అరుపులా లేదు. మనిషి భాషలాలేదు.

అతను మూగవాడు, చెవిటి వాడు, కూడా.

*("బియర్స్" రాసిన 'షిక్ మగువా' కథ ఆధారంగా)*

**(స్వాతి మాసపత్రిక, 1.8.1971)**